# హకీంపేటలో షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



ఇది కద నిజం :హకీంపేటలోని ఏఐఎంఐఎం పార్టీ కార్యాలయం వేదికగా షాదీ ముబారక్ మరియు కళ్యాణ లక్ష్మి పథకాల చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు కార్వాన్ శాసనసభ్యుడు కౌసర్ మొహియుద్దీన్ ఈ కార్యక్రమంలో పాల్గొని, షేక్‌పేట మండలానికి చెందిన లబ్ధిదారులకు స్వయంగా చెక్కులను అందజేశారు. నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ఈ పంపిణీ సాగింది. ఈ కార్యక్రమంలో భాగంగా మొత్తం 20 మంది లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందింది. ఇందులో 19 షాదీ ముబారక్ చెక్కులు మరియు ఒక కళ్యాణ లక్ష్మి పథకం చెక్కు ఉన్నాయి. పంపిణీ చేసిన ఈ మొత్తం చెక్కుల విలువ రూ. 20,02,320 అని అధికారులు వెల్లడించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకాలు పేద ప్రజల ఇంట్లో పెళ్లిళ్లకు ఎంతో ఆసరాగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో షేక్‌పేట మండల కార్యాలయ సిబ్బందితో పాటు ఏఐఎంఐఎం పార్టీ ప్రతినిధులు, స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. లబ్ధిదారులు తమకు అందిన ఆర్థిక సాయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, సహకరించిన ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

# విగ్రహ ఏర్పాటు పనుల పరిశీలన



ఇది కద నిజం ,సికింద్రాబాద్ : సీతాఫలమండీ కూడలిలో తన స్వంత ఖర్చుతో ఏర్పాటుచేయనున్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, బాబు జగ్ జీవన్ రామ్ విగ్రహాల ఏర్పాటు పనులను సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ళ పద్మారావు గౌడ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల్లో నిరంతరం స్పూర్తిని రేకెత్తించేలా విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నామని, వారి అదర్శాలను పాటించేలా తన వంతు కృషి చేస్తున్నానని పద్మారావు గౌడ్ పేర్కొన్నారు. సీతాఫలమండీ ఎస్.సీ., ఎస్. టీ. సంఘాల నేత జీ. చంద్రశేఖర్, బీ. ఆర్. ఎస్. సమన్వయకర్త రాజా సుందర్, నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీసు క్రీడలు


## హబీబ్ నగర్ కానిస్టేబుల్ డి.ఏ. కుమార్‌కు రెండో స్వర్ణ పతకం



ఇది కద నిజం :హైదరాబాద్‌లోని గచ్చిబౌలి సైబరాబాద్ సీఆర్ ప్రధాన కార్యాలయంలో 4వ తెలంగాణ రాష్ట్ర పోలీసు క్రీడా పోటీలు2026 అత్యంత ఉత్సాహంగా సాగుతున్నాయి. ఈ నెల 16వ తేదీన ప్రారంభమైన ఈ క్రీడలు 21వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ రాష్ట్ర స్థాయి పోటీల్లో రాష్ట్రంలోని వివిధ కమిషనరేట్ల నుంచి కానిస్టేబుళ్ల స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు పెద్ద సంఖ్యలో పోలీసు సిబ్బంది పాల్గొని, పలు క్రీడా విభాగాల్లో తమ ప్రతిభను చాటుకుంటున్నారు. ఈ పోటీల్లో భాగంగా నిర్వహించిన దేహ దారుఢ్య విభాగంలో గోల్కొండ జోన్ పరిధిలోని హబీబ్ నగర్ పోలీసు స్టేషన్‌కు చెందిన డి.ఏ. కుమార్ అద్భుత ప్రదర్శన కనబరిచి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు. విశేషమేమిటంటే, ఈ క్రీడల్లో ఆయనకు ఇది రెండో స్వర్ణ పతకం కావడం గమనార్హం. వరుస విజయాలతో ఆయన తన విభాగంలో తిరుగులేని క్రీడాకారుడిగా నిలిచారు. కుమార్ సాధించిన ఈ విజయం పట్ల పోలీసు ఉన్నతాధికారులు మరియు తోటి సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. విధి నిర్వహణలో ఉంటూనే క్రీడల పట్ల మక్కువ చూపి, రాష్ట్ర స్థాయి పోటీల్లో రెండు బంగారు పతకాలు సాధించడం పట్ల ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. ఈ పోటీలు ముగింపు దశకు చేరుకోవడంతో క్రీడాకారుల మధ్య గట్టి పోటీ నెలకొంది.

# డిగ్రీ అధ్యాపక పోస్టులకు

## కాంగ్రెస్ బిగించిన ఉచ్చు – భర్తీలో కొత్త రూల్స్



ఇది కద నిజం: డిగ్రీ అధ్యాపక పోస్టుల భర్తీ కోసం గత 15 సంవత్సరాలుగా పీజీలు చదివి ఎంతోమంది కేంద్రస్థాయిలో యుజిసి నిర్వహించే అర్హత పరీక్ష నెట్లో కూడా అర్హులై లక్షల మంది నిరుద్యోగులు డిగ్రీ లెక్చరర్ నోటిఫికేషన్ కోసం కండ్లు కాయలు కాసే విధంగా ఎదురుచూస్తున్నారు .అయితే గత బిఆర్ఎస్ ప్రభుత్వం 31 డిసెంబర్ 2022 న 544 ఖాళీలతో డిగ్రీ లెక్చరర్ నోటిఫికేషన్ ను విడుదల చేసింది.

కానీ అప్పటి కొంతమంది జూనియర్ లెక్చరర్లు మాకు కూడా అవకాశం ఇవ్వాలని కోరగా టిఆర్ఎస్ ప్రభుత్వం అందుకుగాను టీజీ సెట్ ను నిర్వహించారు. టిజిసెట్ నిర్వహించి ఫలితాలు విడుదల అయ్యే సమయానికి చాలా ఆలస్యమై ఒక సంవత్సరం గడిచిపోయింది. 2023లో ఎన్నికల షెడ్యూల్ రానే వచ్చింది అప్పటికే అప్లికేషన్ తీసుకోవాల్సిన డిగ్రీ లెక్చరర్ నోటిఫికేషన్ వాయిదా పడింది 2022లో విడుదలైన నోటిఫికేషన్ కి ఇప్పటిదాకా భర్తీ చేసే మార్గమే ఇప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వానికి దొరకలేదేమో. 3 వేలకు పైగా పోస్టులు ఖాళీలు ఉన్నప్పటికీ 2022లో 544 పోస్టుల వివరాలు ఉంటే దానికి అదనంగా 3000 పోస్టులు పెంచి ఇవ్వొచ్చు కానీ 2026 సంవత్సరం కూడా వచ్చింది కానీ మూడు సంవత్సరాలు దాటిన ఈ నోటిఫికేషన్ జాడే లేదు. ఈ మూడు సంవత్సరాల్లో ఇయర్ క్యాలెండర్ మారింది కానీ జాబ్ క్యాలెండర్ మాత్రం లేదు.

ఇవన్నీ ఇలా ఉండంగా ఈ పరీక్షకు అర్హత విషయానికి వస్తే యూజీసీ నిర్వహించే నెట్ తెలంగాణ రాష్ట్రం నిర్వహించే టిజిసెట్లు అర్హతలుగా ఉన్నాయి. అలాగే పిజీలో 50% మార్కులు తప్పనిసరి కానీ కాంగ్రెస్ గవర్నమెంట్ మాత్రం నిరుద్యోగుల పొట్ట కొట్టే ప్రయత్నం చేస్తుంది . ఈ అర్హతలు సరిపోవు అన్నట్లు సరికొత్తగా G.O .NO.4 ను తీసుకొచ్చి కష్టపడి చదువుకున్న వారి స్వప్నం ను చెదిరేసే ప్రయత్నం చేస్తుంది. ఈ జీవో నెంబర్ 4 వల్ల ఎంతోమంది నష్టపోయే అవకాశం ఉంది. ఈ జీవో నెంబర్ 4 వలన కొంతమంది పెద్ద కుటుంబాలకు ,రాజకీయ స్నేహితులకే లాభం తప్ప నిరుపేద విద్యార్థికి ఒరిగేదేం లేదు. నెట్ , సెట్ అర్హతలు సాధించిన వారికే అర్హతలు ఉన్న పరీక్షకి కొత్తగా ఇన్ని రోజులు అవసరమా? ఒకవేళ ఈ రూల్స్ వర్తించాలంటే జరగాల్సిన మార్పులు ఎందుకు జరగలేదు.

జీవో నంబర్ 4 లో కొత్త రూల్స్ లు ఏమంటే అకాడమిక్ స్కోరు కి 50 మార్కులు ,

రాతపరీక్షకి 40 మార్కులు,

ఇంటర్వ్యూకి 10 మార్కులు

మొత్తం 100 మార్కులు ఇందులో అకాడమీ స్కోరు అంటే పీహెచ్డీకి 20 మార్కులు, జేఆర్ఎఫ్ సాధించిన వారికి 10 మార్కులు ,m. phil కి 10 మార్కులు ఇలా మొత్తం 50 మార్కులు ఇలా డివైడ్ చేసి మొత్తం 50 మార్కుల కేటాయించారు .

ఒకప్పుడు వంద మార్కులు రాత పరీక్ష ద్వారానే నిర్వహించేవారు .ఇప్పుడు కొత్తగా ఏ రూల్స్ పెట్టడం ఏమైనా న్యాయమేనా ?మరి పీహెచ్డీకి అంత విలువని ఇచ్చేవారు ఇన్ని మార్కులు కేటాయించిన వారు రాష్ట్రంలో అన్ని యూనివర్సిటీలో పిఎస్డి నోటిఫికేషన్లు పోస్టులు పెంచే ప్రతి సంవత్సరం ఎందుకు విడుదల చేయడం లేదు? M.phil కూడా రద్దయింది. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో M.phil కోర్సు లేనేలేదు. JRF అంటారా అది అందరిని ద్రాక్షనే.

ఇలా కొత్త విధానాల ద్వారా ఎవరికి లాభం ఈరోజు కాంట్రాక్ట్ లో పని చేస్తున్న వారి కోసమా, లేక రాజకీయ సుపరిచితుల కోసమా, లేక లోలోపలే గుట్టు సప్పుడు కాకుండా ఈ 50 మార్కులని అడ్డం పెట్టుకొని పోస్టులన్నీ అమ్ముకోడానికా? మిగతా 40 మార్కులు రాత పరీక్ష అది అందరికీ సమానమే అందులో ఎలాంటి సందేహాలకు తావు లేదు. ఇక ఇంటర్వ్యూ సంగతి చెప్పనక్కర్లేదు. దేనికి దీనికి 10 మార్కులు గ్రూప్ వన్ స్థాయికే లేని ఇంటర్వ్యూ డిగ్రీ స్థాయి లెక్చరర్స్ కి ఎందుకు .

ఎందుకంటే అక్కడ కూడా రాజకీయం చేసి మీకు కావాల్సినవారికి, మీరూ ఉద్యోగాలు అమ్ముకున్న వారికి మీరు ఉద్యోగాలు అమ్ముకున్న వారికి మాత్రమే ,మోకాలు చూసి బొట్లు పెట్టి ఉద్యోగాలు ఇస్తారు .ఇక్కడ ఈ దొంగ జీవో నెంబర్ నాలుగుని పుట్టించడానికి ప్రధాన కారణం ఉద్యోగాలు అమ్మడం కోసమే .

డబ్బున్నోళ్లు డిగ్రీ లెక్చరర్ ఉద్యోగం కొనుక్కుంటారు. ఇక్కడ చదివిన వారి పరిస్థితి ఏంటి? వారి ఎదురుచూపులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన బహుమతి ఇదేనా ?15 సంవత్సరాల కలగానే మిగిలిపోనుందా? ఇక ఈ డిగ్రీలు ఎందుకు ?పట్టాలెందుకు? కాబట్టే ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి. టీజీపీఎస్సీ బోర్డు కూడా ఈ నిబంధనలతో కూడిన జీవో నెంబర్ నాలుగుని రద్దు చేయాలని కోరుకుంటున్నాం. లేకపోతే తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమం ఎగిసే అవకాశం ఉంటుంది.

# ఘనంగా నేదురుమల్లి జన్మదిన వేడుకలు



ఉమ్మడి నెల్లూరు జిల్లా కోట, విద్యానగర్ (ఇది కద నిజం ):–ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి91వ జయంతి వేడుకలు నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి ఉమ్మడి నెల్లూరు జిల్లా మంద కుమారులు వెంకటగిరి నియోజకవర్గ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి,నేదురుమల్లి గౌతమ్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ముందుగా ఉమ్మడి నెల్లూరు జిల్లా వాకాడులో వారి నివాసంలో ముందుగా పూజలు చేసి కేకు కట్ చేసి వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కోట మండలం విద్యానగర్ నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళభవన్ లో నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి, నేదురుమల్లి గౌతమ్ రెడ్డి తో పాటు యన్.బి.కె.ఆర్.కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి నియోజకవర్గ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మాట్లాడుతూ ఒక మాజీ ముఖ్యమంత్రి కొడుకు కన్నా ఒక టీచర్ కొడుకు అని చెప్పుకోవడానికి ఇష్టపడతనని చెప్పారు.విద్యానగర్ లో అన్ని విద్యాసంస్థలు అన్ని ఒక యూనివర్సిటీ చేయాలని ఆయన కళ అని దానికి ఆదిశగా అడుగులు పడుతున్నాయి అని,మధ్యలో ఎన్నో ఆటంకాలు వస్తుంటాయి అని వచ్చిన ఆయన కళను పూర్తి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ దందోలు లక్ష్మీ నారాయణరెడ్డి,వైకాపా నాయకులు, కార్యకర్తలు, నేదురుమల్లి అభిమానులు యన్.బి.కె.ఆర్.కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్న జర్మన్ దేశస్థులు



ప్రముఖ దైవ క్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వ స్వామిని శుక్రవారం జర్మన్ రష్యా దేశస్థులు సందర్శించుకున్నారు.

ప్రపంచ ప్రఖ్యాతమైన ఈ ఆలయం గురించి వినటం కారణంగా ఆలయ దర్శనానికి వచ్చినట్లు జర్మన్ రష్యా దేశస్తులు తెలిపారు. జర్మన్ రష్యా దేశాలకు చెందిన భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆలయ విశిష్టత, చారిత్రక ప్రాధాన్యం, అద్భుత శిల్ప సంపద గురించి ఆలయ వైదిక కమిటీ విదేశీ పర్యాటకు వివరించారు.దర్శనం అనంతరం వేద పండితులు, ఆశీర్వచనం తీర్థప్రసాదాలు అందజేశారు.

# రాపూరు-చిట్వేల్ ఘాట్ లో ప్రయాణ అత్యంత ప్రమాదకరం



నెల్లూరు జిల్లా రాపూరు (ఇది కద నిజం ):– నెల్లూరు జిల్లా నుండి ఉమ్మడి కడపజిల్లా మరియు అన్నమయ్య జిల్లా వెళ్లాలంటే వాహనదారులు పెద్ద సాహసమే చేయాల్సిన అవసరం ఉంది,నెల్లూరు జిల్లా రాపూరు నుండి చిట్వేల్ కు వెళ్లాలంటే 19 కిలోమీటర్లు ఘాట్ రోడ్డు లో ప్రయాణించాలి,ఘాట్ రోడ్డులో ప్రమాదకరమైన మలుపు వద్ద సూచక బోర్డులు లేకపోవడం,కొన్నిచోట్లరోడ్డు కుంగిపోవడం,పిట్టగోడలుపడిపోవడం లాంటి దృశ్యాలు ఘాట్ రోడ్డు లో తారాస పడుతుంటాయి.గత కొన్ని రోజులుగా ఘాట్ రోడ్డు ప్రమాదాల జరుగుతున్న సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని వాహనదారులు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తూ ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుచున్నారు.

